నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
13 | హైదరాబాద్, ఆదివారం 28 జనవరి 2024 | YADADRI BHUVANAGIRI

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలి

- బండకొత్తపల్లి గ్రామస్తుల వినతి

తాసీల్దార్ జలకుమారికి వినతిపత్రాన్ని అందిస్తున్న గ్రామస్తులు

గుండాల, జనవరి 27 : మండలంలోని బండకొత్తపల్లిలో అనుమతులు లేకుండా జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరుతూ గ్రామస్తులు శనివారం తాసీల్దార్ జలకుమారికి వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన కొందరు బిక్కేరు వాగు నుంచి విచ్చలవిడిగా ఇసుక రవాణా చేస్తున్నారని, దీంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో గోపాల్‌దాస్ వెంకన్న, గోపాల్‌దాస్ విజయ్‌కుమార్, మల్లికార్జున్, ఉపేందర్, రాజు, శేఖర్, కార్తిక్, భిక్షం పాల్గొన్నారు.

ఆలేరు మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం వీగినట్లు ప్రకటిస్తున్న ఆర్డీఓ అమరేందర్

తుర్కపల్లి గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు ముందుకు సాగేనా..?

బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటుకు చర్యలు

- పార్కు మంజూరుకు మాజీ విప్ సునీత కృషి
- భూసేకరణ పూర్తి.. రైతులకు పరిహారం అందజేత
- అందుబాటులోకి వస్తే దండుమల్కాపురం లెక్క పరిశ్రమలు
- స్థానికులకే ఉద్యోగాలు దక్కే అవకాశం
- కనీసం పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

జిల్లాలోని తుర్కపల్లిలో గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి చర్యలు తీసుకుంది. భూసేకరణ కూడా పూర్తి చేసి భూనిర్వాసితులకు పరిహారం చెక్కులు కూడా పంపిణీ చేసింది. కానీ, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టడం లేదు. దాంతో పార్కు కొనసాగింపుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇది అందుబాటులోకి వస్తే పెద్దఎత్తున పర్యావరణహిత పరిశ్రమలు తరలిరానున్నాయి. స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

– యాదాద్రి భువనగిరి, జనవరి 27 (నమస్తే తెలంగాణ)

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక వాడల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని తుర్కపల్లిలో మరో పారిశ్రామికవాడ ఏర్పాటు చేయాలని అప్పటి సర్కారు భావించింది. తుర్కపల్లిలోని సర్వే నంబర్ 72లో 93.21ఎకరాల్లో పార్కు ఏర్పాటుకు చర్యలు ప్రారంభించింది. భూసేకరణ కోసం ప్రభుత్వం 2021 జనవరి 14న నోటిఫికేషన్ విడుదల చేసింది. 61మంది రైతుల నుంచి భూసేకరణ కూడా పూర్తయ్యింది. ఎకరానికి 17లక్షలతోపాటు ఇతరాలు కలిపి మొత్తంగా రూ.16.64 కోట్లను పరిహారం కింద ఇచ్చింది.

గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేస్తున్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి (ఫైల్)

పార్కు మంజూరుకు గొంగిడి సునీత కృషి

తుర్కపల్లిలో గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు మంజూరు కోసం మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి ఎంతో కృషి చేశారు. మనకంటూ ఓ ప్రత్యేకత ఉండాలని, పార్కు కోసం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను ఎన్నోసార్లు కలిశారు. విజ్ఞప్తులు, వినతులు అందజేశారు. ఆమె విన్నపం మేరకు ఎట్టకేలకు పార్కు మంజూరైంది. భూసేకరణలో కొన్ని ఇబ్బందులు తలెత్తినప్పటికీ అది కూడా పూర్తి చేశారు.

దండుమల్కాపురం మాదిరిగా పరిశ్రమలు..

చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలో గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కును నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో పెద్ద సంఖ్యలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. నిర్మాణ సామగ్రి, ప్యాకేజింగ్, యంత్రాలు, ఫర్నిచర్, ఎలక్ట్రికల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంజినీరింగ్, బయో ఫర్టిలైజర్లు, ప్రింటింగ్ తదితరాలకు సంబంధించిన ఉత్పత్తులు ఎన్నో తయారవుతున్నాయి. అక్కడ తయారయ్యే ఉత్పత్తులు, వస్తువులు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇదే విధంగా తుర్కపల్లిలోనూ ఏర్పాటు చేయాలని నాటి ప్రభుత్వం భావించింది. ఇది అందుబాటులోకి వస్తే దండుమల్కాపురం మాదిరిగా తుర్కపల్లిలోనూ పెద్ద ఎత్తున పరిశ్రమలు తరలిరానున్నాయి.

స్థానికులకే ఉద్యోగావకాశాలు..

గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ అందుబాటులోకి వస్తే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. స్కిల్డ్, అన్‌స్కిల్డ్ ఉద్యోగులకు జాబ్‌లు దొరుకనున్నాయి. పార్కులో అధిక శాతం ఉద్యోగాలు స్థానికులకే దక్కే అవకాశం ఉంటుంది. తుర్కపల్లి మండలంతోపాటు బొమ్మలరామారం, యాదగిరిగుట్ట, జగదేవ్‌పూర్, భువనగిరి మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన వారికి ఉద్యోగాలు లభిస్తాయి. స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని నాడు మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పట్టుబట్టారు. పార్కు ఏర్పాటవుతుందనే ఉద్దేశంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇప్పటికే భూముల రేట్లకు రెక్కలు వచ్చాయి. గతంలో ఇక్కడ ఎకరం రూ.10 లక్షలు కూడా పలికేది కాదు. ఇప్పుడు సుమారు కోటి నుంచి రూ.2 కోట్ల వరకు విలువ ఉంది.

ముందుకెళ్లేనా..?

బీఆర్ఎస్ హయాంలో తీసుకొచ్చిన ఇంత పెద్ద ప్రాజెక్టుపై కాంగ్రెస్ ఫోకస్ పెట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్కు ముందుకు కొనసాగుతుందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు దీనిపై ఏ ఒక్కరూ స్పందించలేదు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి జిల్లాలో రెండుసార్లు పర్యటించినా చప్పుడు చేయలేదు. కలెక్టరేట్, యాదగిరిగుట్టలో అధికారులతో సమీక్షలు నిర్వహించినా పట్టించుకోలేదు. స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సైతం పట్టించుకోవడం లేదనే ప్రచారం జరుగుతున్నది.

బీఆర్ఎస్‌పై వీగిన అవిశ్వాసం

- ఆలేరు మున్సిపల్ చైర్మన్‌పై కొందరు సభ్యుల తిరుగుబాటు
- 12 మంది సభ్యులకు ఓటింగ్‌కు ఐదుగురే హాజరు
- కోరం లేక సమావేశాన్ని రద్దు చేసిన ఆర్డీఓ
- చైర్మన్‌గా కొనసాగనున్న వస్పరి శంకరయ్య

అవిశ్వాస తీర్మాన సమావేశం నుంచి బయటకు వస్తున్న ఐదుగురు కౌన్సిలర్లు

ఆలేరు, జనవరి 27 : బీఆర్ఎస్‌కు చెందిన ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్యపై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. మున్సిపాలిటీలో మొత్తం 12 మంది కౌన్సిలర్లు ఉండగా ఇందులో బీఆర్ఎస్ నుంచి 9, కాంగ్రెస్ నుంచి ఒకటి, బీజేపీ నుంచి ఒకరు, ఇండిపెండెంట్‌గా ఒక కౌన్సిలర్ విజయం సాధించారు. మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రతిపాదిస్తూ 8 మంది కౌన్సిలర్లు ఈ నెల 8న కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ కోసం శనివారం ఆర్డీఓ అమరేందర్ మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కాగా కేవలం ఐదుగురు సభ్యులు మాత్రమే హాజరయ్యారు. అరగంట పాటు వేచి చూసిన అధికారులు కోరం లేక పోవడంతో సమావేశాన్ని మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 2:30 గంటల వరకు కూడా ఒక్కరూ హాజరు కాక పోవడంతో సమావేశాన్ని ఆర్డీఓ ముగించారు. మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్యపై ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చక్రపాణి, లావణ్య, స్వామి, యాదగిరి, రవి, ప్రసాద్, కళ్యాణ్, జైనుధన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, వేదికపై జడ్పీచైర్మన్లు నరేందర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భూపాల్‌రెడ్డి, భాస్కర్‌రావు, నాయకులు చాడ కిషన్‌రెడ్డి, సైదులు గౌడ్, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు

ఓట్లేసినందుకు చెప్పుతో కొడతారా?

- హామీలు అమలు చేయలేక మంత్రుల బూతులు
- పాలన చేతగాక కేసీఆర్‌పై నిందలు
- కృష్ణాజలాలు తరలించుకుపోతున్నా పట్టింపు లేదు
- ఎస్ఆర్ఎస్‌పీలో నీళ్లున్నా రైతులకు ఇస్తలేరు
- కేసులు, దాడులకు భయపడేది లేదు
- బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేద్దాం
- త్వరలోనే నల్లగొండకు అధినేత కేసీఆర్
- లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుదాం
- నల్లగొండ బీఆర్ఎస్ మీటింగ్‌లో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి
- పెద్దఎత్తున తరలివచ్చిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు

నల్లగొండ ప్రతినిధి, జనవరి 27 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీకి ఓట్లేసి గెలిపించినందుకు ప్రజలను చెప్పులతో కొడతారా? అని మంత్రులను బీఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సూటిగా ప్రశ్నించారు. ఎన్నికల్లో అధికారం కోసం అడ్డగోలు హామీలిచ్చి ఇప్పుడు అమలు చేయలేక ఎదురుదాడికి దిగుతున్నారని విమర్శించారు. ప్రశ్నిస్తే తట్టుకోలేక అసహనంతో మంత్రులు బూతులు మాట్లాడుతున్నారన్నారు. అధికారంలోకి రాగానే ఎకరాకు రూ.15వేల చొప్పున రైతుబంధు డబ్బులు ఇస్తామని చెప్పి ఇప్పుడు మాట మార్చి రూ.10 వేల చొప్పున కూడా ఇవ్వలేకపోతున్నది నిజం కాదా? అని ప్రశ్నించారు. రైతుబంధు డబ్బులు అందడం లేదని ప్రశ్నిస్తే చెప్పుతో కొడతామనడం కాంగ్రెస్ మంత్రుల అహంకారానికి నిదర్శమన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుదామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇటీవలే లోక్‌సభ నియోజకవర్గాల వారీగా సమీక్షలు పూర్తిచేసుకున్న బీఆర్ఎస్ పార్టీ ఉమ్మడి జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా విస్తృత స్థాయి సమావేశాలకు సన్నద్ధమైంది. అందులోభాగంగా శనివారం నల్లగొండలో నియోజకవర్గ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించింది. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి పెద్ద సంఖ్యలో పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు తరలివచ్చారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. గత నెల 9న సోనియాగాంధీ జన్మదినం నుంచే అమలు చేస్తామన్న రూ.2లక్షల రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. హామీలు అమలుచేయలేక, పాలన చేతకాక కేసీఆర్‌పై నెపం నెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని పేర్కొన్నారు. ఇక హామీల అమలు గురించి ప్రశ్నిస్తే మంత్రులు వ్యక్తిగత దూషణలు చేస్తున్నారని, తాము అదే దారిలోకి వస్తే కాంగ్రెస్ మంత్రులు తట్టుకోలేరని హెచ్చరించారు. కేసులు, దాడులతో భయపెట్టాలని చూస్తున్నారని, తమ పార్టీ శ్రేణులకు, తమకు అవి కొత్తేమీ కాదని, ఉద్యమకాలం నుంచే ఇలాంటివి తట్టుకుని నిలబడ్డామని గుర్తుచేశారు. తాము అధికారంలో ఉండగా ఇలాంటి వాటిని ప్రోత్సహించలేదని, అధికారం శాశ్వతం కాదని హితవు పలికారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల అమలుకు ప్రజల పక్షాన పోరాటానికి సిద్ధం కావాలన్నారు. అప్పుడే కరెంటు కోతలు మొదలయ్యాయని, మహాలక్ష్మి పథకంతో జుట్లు పట్టుకునేలా చేస్తున్నారని అన్నారు. కేసీఆర్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధిలో అగ్రస్థానంలోకి దూసుకెళ్లిందని, ఆయన రాష్ట్రాన్ని సొంత కుటుంబంలా భావించి తీర్చిదిద్దారని తెలిపారు. కేసీఆర్ చేతుల్లోనే తెలంగాణ సురక్షితంగా, సుభిక్షంగా ఉంటుందని స్పష్టం చేశారు.

హారతులు పట్టిన హీనులు..

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు కృష్ణా జలాలను నాటి ముఖ్యమంత్రులు వైఎస్, చంద్రబాబు అక్రమంగా తరలించుకుని పోతుంటే హారతులు పట్టిన చరిత్రహీనులు నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పెద్దలని విమర్శించారు. ప్రస్తుతం సాగర్ ఎడమ కాల్వకు నీళ్లు ఇవ్వలేక పోతున్నారని అన్నారు. ఇక ఎస్ఆర్ఎస్‌పీలో నీళ్లున్నా వాటిని వినియోగించుకునే తెలివి లేదన్నారు. రైతులకు ఉద్దేశపూర్వకంగానే సాగునీళ్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. నల్లగొండ జిల్లా నుంచే కాంగ్రెస్‌పై పోరాటం షురూ చేస్తామని, తెలంగాణ సమాజానికి పోరాటాలు నేర్పిందే నల్లగొండ జిల్లా అని అన్నారు. అధికారంలోకి వచ్చిందే తడవుగా బీజేపీతో కుమ్మక్కై బీఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాలకు కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదన్నారు. సూర్యాపేటలో అలాంటి అక్రమ కుమ్మక్కును బీఆర్ఎస్ తిప్పికొట్టిందని, సూర్యాపేట నుంచే తిరిగి విజయబావుటా మొదలైందన్నారు. వారం, పది రోజుల్లో గులాబీ బాస్ కేసీఆర్ ప్రజల్లోకి వస్తారని, త్వరలోనే నల్లగొండ పర్యటనకు రానున్నారని జగదీశ్‌రెడ్డి వెల్లడించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటేందుకు పార్టీ శ్రేణులంతా సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, యాదాద్రిభువనగిరి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, పార్టీ నేతలు చాడ కిషన్‌రెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, నిరంజన్‌వలీ, పంకజ్ యాదవ్, అభిమన్యు శ్రీనివాస్, బోనగిరి దేవేందర్, బొర్రా సుధాకర్, తండు సైదులుగౌడ్, సహదేవ రెడ్డి, కరీంపాషా, పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, దేప వెంకట్‌రెడ్డి, ఐతగోని యాదయ్య, శరణ్యారెడ్డి, రావుల శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


సమావేశానికి తరలివచ్చిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు

ముగిసిన జాన్‌పహాడ్ దర్గా ఉర్సు

- సైదులు బాబా సమాధి వద్ద దీపారాధనతో పరిపూర్ణం
- పారిశుధ్య పనులు ప్రారంభం

జాన్‌పహాడ్ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

పాలకవీడు, జనవరి 27 : మూడు రోజులపాటు సాగిన జాన్‌పహాడ్ దర్గా ఉర్సు శనివారం దీపారాధనతో ముగిసింది. తొలిరోజు లక్షకు పైగా వచ్చిన భక్తులు మూడో రోజూ వేల సంఖ్యలో వచ్చి పూజలు చేశారు. సైదులు బాబా సమాధుల వద్ద చాదర్లు సమర్పించారు. పలువురు భక్తులు నాగదేవత పుట్ట వద్ద పాలు పోశారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. గంధం అందని పలువురు భక్తులు ఆలయ ముజావర్ జానీ ఇంటి నుంచి స్వీకరించారు.

పారిశుధ్యం పనుల్లో అధికారులు, సిబ్బంది

ఉర్సుకు లక్షకు పైగా భక్తులు తరలిరావడంతోపాటు వ్యాపార సముదాయాలు, తాత్కాలిక దుకాణాల ద్వారా వచ్చిన వ్యర్థాలతో వీధులన్నీ చెత్తతో నిండిపోయాయి. దాంతో రెవెన్యూ, పంచాయతీ అధికార యంత్రాంగం, సిబ్బంది యుద్ధప్రాతిపదికన పారిశుధ్య పనులు చేపట్టారు. ఎంపీడీఓ వెంకటాచారి, ఎంపీఓ దయాకర్ ఆధ్వర్యంలో 22 గ్రామపంచాయతీలకు చెందిన కార్యదర్శులు, పంచాయతీ సిబ్బందితోపాటు తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటు చేసుకొని వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నారు. ఉర్సుకు వివిధ జిల్లాల నుంచి వచ్చి ఏర్పాటు చేసుకున్న మిఠాయి, ఆటబొమ్మలు, చెరుకు అమ్మకాల దుకాణాలను తొలగిస్తున్నారు. ఉర్సుకు ప్రధాన ఆకర్షణగా నిలిచిన ఫకీర్లు తమ ప్రాంతాలకు పయనమయ్యారు.

జాన్‌పహాడ్ దర్గా పరిసరాల్లో పారిశుధ్య పనులు చేపడుతున్న సిబ్బంది

యాదగిరిగుట్ట ప్రధానాలయ క్యూ లైన్లలో భక్తుల రద్దీ

యాదగిరీశుడికి తిరువీధి సేవ

యాదగిరిగుట్ట, జనవరి 27 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి తిరువీధి సేవ అత్యంత వైభవంగా జరిగింది. శనివారం సాయంత్రం స్వామి వారిని గరుఢ వాహనం, అమ్మవారిని తిరుచ్చీ వాహనంపై వేంచేపు చేసి సేవను కొనసాగించారు. పశ్చిమతల రాజగోపురం గుండా తిరు మాఢవీధుల్లో ఊరేగించారు. ఉత్తర రాజగోపురం నుంచి ఆలయంలోకి సేవను ప్రవేశింపజేశారు. స్వామి, అమ్మవార్లకు నిత్యారాధనలు శాస్త్రోక్తంగా జరిగాయి. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో నారసింహులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా ముస్తాబు చేసి నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహించారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 28 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.55,43,899 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

పిల్లలమర్రి శివాలయాల్లో హైకోర్టు జడ్జి పూజలు

సూర్యాపేట రూరల్ : పిల్లలమర్రి గ్రామంలో గల చారిత్రాత్మక శివాలయాలను హైకోర్టు జడ్జి పుల్లా కార్తీక్ సందర్శించారు. ఎరుకేశ్వర, నామేశ్వర, త్రికుటాలయాలను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల చరిత్రను అడిగి తెలుసుకున్నారు.

యాదగిరిగుట్ట కొండపైన తాత్కాలిక వసతి గృహం

- కొండకింద తులసీ కాటేజీ వసతి గృహంలో తాత్కాలిక కోర్టు
- వైటీడీఏ, ఆలయ అధికారులతో సమీక్షలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య


ప్రెసిడెన్షియల్ సూట్‌లో అధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట, జనవరి 27 : భక్తులు యాదగిరిగుట్ట కొండపైన నిద్రించేలా వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అధికారులకు సూచించారు. యాదగిరిగుట్టకు మంజూరైన కోర్టును ఏర్పాటు చేసేందుకు కొండకింద తులసీ కాటేజీ వద్ద గల వసతి గృహాన్ని కేటాయించాలన్నారు. శనివారం యాదగిరిగుట్టలోని ప్రెసిడెన్షియల్ సూట్‌లో వైటీడీఏ, ఆలయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొండపైన, కొండకింద, టెంపుల్ సిటీలో నిర్మాణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంకా చేపట్టాల్సిన నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. క్యూ కాంప్లెక్స్‌తోపాటు కొండపైన అనువైన ప్రాంతాన్ని గుర్తించి వారం రోజుల్లో వసతి గృహాన్ని ఏర్పాటు చేస్తామని ఆలయ అధికారులు ప్రభుత్వ విప్‌కు తెలిపారు. సమీక్షలో ఈఓ రామకృష్ణారావు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఈఈ ఊడెపు రామారావు, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, ఏఈ సునీల్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.